క్లుప్తంగా...

ఆసిఫ్‌నగర్ ఠాణా ఫేస్‌బుక్ హ్యాక్

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ అఫీషియల్ ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 11గంటలకు ఠాణా ఫేస్‌బుక్ హ్యాక్ అయినట్లు గుర్తించినట్లు తెలిపారు. హ్యాకర్లు ఫేస్‌బుక్‌లో అశ్లీల చిత్రాలను అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. గురువారం ఉదయం సాంకేతిక నిపుణులు హ్యాక్ అయిన ఫేస్‌బుక్‌ను పునరుద్ధరించి వాటిని తొలగించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో 40 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. గురువారం ఎమ్మెల్యే రాజాసింగ్ సదరు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజల కోసం ధూల్‌పేట్‌లోని తన కార్యాలయం 24గంటల పాటు పని చేస్తుందన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

ఘనంగా సంగీత దినోత్సవం



హైదరాబాదీ బ్రదర్స్ ఆధ్వర్యంలో గాత్ర కచేరి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంగీత కళలకు సముచిత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వ సలహాదరులు డా.కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంగీత దినోత్సవాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. గురువారం జరిగిన ఈ వేడుకలో హైదరాబాదీ బ్రదర్స్ కర్ణాటక సంగీత గాత్ర కచేరి ఆకట్టుకుంది. రామాచారి శిష్య బృందం ఆలపించిన మధురగీతాలు అలరించాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



నాగేంద్ర కుమార్

గోల్కొండ: దుకాణానికి వెళ్లొస్తానని వ్యక్తి అదృశ్యమైన సంఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. గోల్కొండ ఎస్సై జి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... నాగేంద్ర కుమార్ (29) తన స్నేహితుడు దీపునిస్సార్ తో కలిసి గోల్కొండ వాసవీ కాలేజ్ సమీపంలోని ఇబ్రహీంబాగ్‌లో నివసిస్తున్నాడు. కాగా వృత్తిరీత్యా వీరిద్దరు పెయింటర్లు. ఇదిలా ఉండగా గత నెల 19వ తేదీన నాగేంద్ర కుమార్ తన రూమ్‌మేట్ దీపు సాగర్‌కు వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. కాగా తన స్నేహితుడి ఆచూకీ కోసం దీపునిస్సార్ ఉత్తరప్రదేశ్‌లోని నాగేంద్రకుమార్ బంధువులకు ఫోన్ చేసిన కూడా ఆచూకీ తెలియలేదు. దీంతో దీపునిస్సార్ బుధవారం రాత్రి గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ప్రాంతంలో మహిళ...



పూనమ్ భాయ్

హైదరాబాద్‌కు చెందిన పూనమ్ భాయ్‌కి (23) కొంతకాలంగా మతి స్థిమితం సరిగా లేదు. ఆమెకు ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో చికిత్స కూడా అందిస్తున్నారు. అప్పుడప్పుడు పూనమ్ భాయ్ ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంత్రం ఎప్పుడో తిరిగి వచ్చేది. ఇదే క్రమంలో గత నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు బయటకు వెళ్లింది. ఇంతకు ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆమె బంధువు గోల్కొండ పోలీస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'జెర్మన్‌టెన్'లో మెరుగైన వైద్యసేవలు

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని జర్మన్‌టెన్ ఆసుపత్రిని సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మీర్ జావద్ జర్ ఖాన్ వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గతంలో ఆర్థోపెటిక్ సేవలు అందించే వారమని ప్రస్తుతం సూపర్ స్పెషాల్టీ దిశగా అన్ని సేవలను అందిస్తున్నామన్నారు. 15 సంవత్సరాలుగా నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో సేవలు అందించిన ఆర్థోపెటిక్ సీనియర్ డాక్టర్ ఖలీల్‌ఉల్లా ఇకపై జర్మన్‌టెన్‌లో సేవలను ప్రారంభించారన్నారు. ఇప్పటికే డాక్టర్ శ్యామ్ సుందర్, డాక్టర్ మధుబృందం ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నారన్నారు. రోగులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ట్రాఫిక్‌తో హైరానా

మెహదీపట్నం నుంచి నానల్‌నగర్ వరకు నిత్యం ట్రాఫిక్ జామ్



మెహిదీపట్నం - నానల్‌నగర్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్

గోల్కొండ: మెహిదీపట్నం, టోలిచౌకి తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు బేజారెత్తిపోతున్నారు. అసలే ఎండ తీవ్రంగా ఉండటం.. దీనికి తోడు దాదాపు కిలోమీటర్ మేర ట్రాఫిక్‌లో వాహనాలు చిక్కుకుపోవడంతో వాహనదారులకు ఊపిరాడటం కష్టమవుతోంది. మెహిదీపట్నం జయప్రకాశ్ ఆస్పత్రి నుంచి రేతిబౌలి రోడ్డు వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి.

- అరకిలోమీటర్ ప్రయాణానికి సుమారు 18 నుంచి 20 నిమిషాల సమయం పడుతోంది. అదే విధంగా రేతిబౌలి నుంచి నానల్‌నగర్ జంక్షన్ వరకు 300 మీటర్ల దూరం దాటాలంటే కనీసం 15 నిమిషాలు పడుతోంది. కాగా నానల్‌నగర్ చౌరస్తా – టోలిచౌకి ప్రధాన రహదారిని ఆనుకున్న రెస్టారెంట్లు, కార్యాలయ ముందు గంటల తరబడి వాహనాలు రోడ్డుమీదే పార్కింగ్ చేసి ఉంటున్నాయి.
- టోలిచౌకి చౌరాస్తా వద్ద కూడా ఇదే దుస్థితి నెలకొంది. టోలిచౌకి నుంచి అక్బర్‌పురా మీదుగా మోతీదర్వాజ వాహనాలు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. టోలిచౌకి చౌరస్తా నుంచి సెవెన్ టూంబ్స్ రహదారిపై కూడా ఇదే దుస్థితి నెలకొంది. ఈ మార్గంలో నాలా పనులు జరుగుతుండటంతో ట్రాఫిక్ మరింత జఠిలంగా మారింది.
- టోలిచౌకి నుంచి నానల్‌నగర్ చౌరస్తా వరకు ఉన్న కిలోమీటర్ రహదారికి ద్విచక్ర వాహనం వెళ్లాలంటే కనీసం 25 నిమిషాల సమయం పడుతోంది. గత వారం వరకు టోలిచౌకి పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయం వక్కన టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉండేది.
- అది కాస్త గోల్కొండకు తరలి పోయింది. దీంతో వాహనదారులు మరింతగా రెచ్చిపోయి రోడ్ల మీదనే కార్లు, ద్విచక్ర వాహనాలను పార్క్ చేసి ఉంచుతున్నారు. అక్రమ పార్కింగ్‌లపై ఉక్కు పాదం మోపితే గానీ ట్రాఫిక్ జామ్‌లకు పరిష్కారం ఉండదని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

దూద్‌బౌలి: దూద్‌బౌలిలోని శ్రీ సిద్ధిబుద్ధి గణపతి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ ధర్మకర్తలు మహేశ్వరం శ్రీనివాసాచారి గో పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ శర్మ, దేవాలయ ప్రధానాచార్యకులు సి.వీరయ్య శర్మ, దేవాలయ ధార్మిక సలహదారులు చల్లా మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథులుగా దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, కామాటిపురా సీఐ యదేంద్ర, హుస్సేనీఆలం సీఐ నరేశ్‌కుమార్, ఐ.ఎస్. సదన్ సీఐ మాలియా తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణకు కృషి



గోవులను రక్షించిన టీటీడీ గోరక్ష సమితి సభ్యులు కోటి, శ్రీధర్

అబిడ్స్: గోవుల సంరక్షణకు టీటీడీ గోరక్ష దళ్ ప్రత్యేకంగా కృషి చేస్తోందని దళ్ సభ్యులు కోటి, శ్రీధర్ పేర్కొన్నారు. నగర శివారులలోని పలు ప్రాంతాల నుంచి కబేలాలకు తరలిస్తున్న 95 గోవులను టీటీడీ గోరక్షా దళ్, యుగ తులసి ఫౌండేషన్ సభ్యులంతా కలిసి రక్షించినట్లు ఆయన వివరించారు. రక్షించిన గోవులను జియాగూడ గోశాలతో పాటు పలు గోశాలలకు తరలించామన్నారు. గోవులను రక్షించిన వారిలో నితీష్, రవీందర్ గౌడ్, కెదార్ సింగ్, కామేష్ సింగ్, అక్షయ్ చారి, సందేశ్ సింగ్, అభిషేక్, చందు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేస్తే ఇబ్బందులు ఉండవు

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేస్తేనే ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి – నానల్‌నగర్ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అయా ప్రాంతాలలో పూర్తి అయిన నాలా పనులు, ప్రస్తుతం జరుగుతున్న బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. హకీంపేట్ మిలటరీ ఏరియా నుంచి వరదనీరు నిజాం కాలనీలోకి వస్తుందన్నారు. దీనివల్ల నిజాం కాలనీలో వరదనీరు వచ్చేదని... అదే వరదనీరు టోలిచౌకి మీదుగా నదీమ్ కాలనీని ముంచెత్తేదని ఆయన అన్నారు. దీనిని నివారించడానికి హకీంపేట్ మిలటరీ ప్రాంతంలోని బుల్కాపూర్ నాలాను దారి మళ్లిస్తున్నామని.. ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు.

- అంతేకాకుండా నిజాం కాలనీకి వస్తున్న వరద నీటి కోసం బాక్స్‌టైప్ పనులను పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం టోలిచౌకి ఫ్లై ఓవర్ కింది భాగంలో బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని.. ఈ పనులు పూర్తయితే టోలిచౌకి రుమాన్ హోటల్, రహ్మత్ హోటల్‌తో పాటు టోలిచౌకి చౌరస్తాలో ఉన్న షాపులు, రెస్టారెంట్లలో వరదనీరు రాదని తెలిపారు.
- మరోవైపు నదీమ్ కాలనీని కూడా పూర్తిగా వరద నీటి నుంచి సురక్షితంగా ఉంచేందుకు కోట్లాది రూపాయలతో పనులు జరిగాయని అన్నారు. అందులో భాగంగానే శాతం చెరువులో వరదనీరు నిల్వ ఉంచకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్ పాల్గొన్నారు.

కుతుబ్‌షాహీ కాలం నాటి మసీదుల అభివృద్ధికి కృషి



గోల్కొండ నీమ్ బౌలి కమిటీ సభ్యులతో పాషాభాయ్

గోల్కొండ: గోల్కొండలోని కుతుబ్‌షాహీ కాలం నాటి మసీదుల పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని గోల్కొండ నీమ్ బౌలి మసీదు నిర్వహణ కమిటీ అధ్యక్షులు గులాం మొహినొద్దీఖాన్ పాషాభాయ్ అన్నారు. గురువారం నీమ్‌బౌలి మసీదులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుతుబ్‌షాహీ రాజుల కాలంలో నిర్మించిన ఈ మసీదులు భావితరాలకు గుర్తుగా ఉంచాలన్నారు. శాస్త్రీయ పద్ధతిలో ఈ మసీదులకు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సలహాలు, సూచనలతోనే ఈ పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నీమ్ బౌలి మసీదుతో పాటు గోల్కొండ, దాని పరిసరాలలో ఉన్న కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి మసీదుల పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు అసబ్‌ఖాలెద్, ఖదీర్, జావెద్ తదితరులున్నారు.

కళలు, కళాకారులకు ప్రభుత్వం పెద్దపీట



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం బంగారు బాటలో పయనిస్తుందని శాసన మండలి సభ్యులు టీ.రవీందర్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో కళావేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి కళావేదిక సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళలు కళాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, సినీ నటుడు రఘుకుంచె తదితరులు పాల్గొన్నారు.

నానల్‌నగర్ అభివృద్ధికి కృషి

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారిని కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో వీడీసీసీ రోడ్డు, కొత్త డ్రైనేజీలైన్లు వేశామన్నారు. డివిజన్ అభివృద్ధికి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు.

వీసీఈఏ తెలంగాణ నూతన సంఘం ఏర్పాటు

డబీర్‌పురా: విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (వీసీఈఏ) తెలంగాణ రాష్ట్ర సంఘంను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. తెలంగాణ రాష్ట్రంలోని అంధ ఉద్యోగుల సంక్షేమం కోసం విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుంది. విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతి నాలుగేళ్లకొకసారి ఎన్నికలను నిర్వహిస్తుంది. జిల్లా, రాష్ట్రస్థాయిలో కొత్త సంస్థను ఎన్నుకుంటుంది. గురువారం విజువల్లీ ఛాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా యాడారం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాలికో శ్రీనివాస్, కోశాధికారిగా పెండ్యాల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎ.నవీన్ కుమార్, కె.రవీందర్ రెడ్డి, ఎం.షరీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.వెంకటేశ్, సంయుక్త కార్యదర్శిగా పి.గామిస్‌లను ఎన్నుకున్నారు.

ఉస్మానియాలో నిలిచిన విద్యుత్

ఇబ్బందులు పడ్డ రోగులు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో కొద్ది సేపు విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయం సుమారు 10.30 గంటల ప్రాంతంలో ఉస్మానియాలోని అవుట్ పేషంట్ విభాగంలో షార్ట్ సర్క్యూట్ చేంచర్‌లో లోపం వల్ల అక్కడ విద్యుత్ వైరు కాలిపోవడంతో ఓపీ, ఫార్మసీ కేంద్రాలల్లో దాదాపు 50 నిమిషాల పాటు విద్యుత్ నిలిచిపోయింది. దీంతో ఓపీ చీటీల కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడ్డారు. ఫార్మసీ కేంద్రంలో మందుల పంపిణీ నిలిచిపోయింది. దీనిపై వెంటనే స్పందించిన ఆస్పత్రి పరిపాలనా విభాగం అధికారులు విద్యుత్ సిబ్బందిని పిలిపించి మరమ్మతులు చేయించారు. దీంతో రోగులు, వారి సహాయకులు, ఊపిరి పీల్చుకున్నారు.

నీటి ఎద్దడిని తీర్చాలి

– బీజేపీ నాయకులు అమర్‌సింగ్



మహిళలతో కలిసి వాటర్ వర్క్స్ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్ డివిజన్‌లో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి. అమర్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన గుడిమల్కాపూర్‌లోని జలమండలి జనరల్ మేనేజర్‌ను స్థానికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్వాన్ కార్గిల్ నగర్, గంగానగర్, సబ్జి మండి తదితర ప్రాంతాలలో ప్రజలు తాగునీటి కొరకు నానా అవస్థలు పడుతున్నారని ఆయన అన్నారు. కింది స్థాయి అధికారులు నీటి సరఫరాను మెరుగుపరచడంలో శ్రద్ధ కనబర్చడం లేదన్నారు. నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో నల్లాలలో వచ్చే నీటి సరఫరాలో కోత విధించకుండా చూడాలన్నారు. అదేవిధంగా లో ప్రెషర్ ఉన్న ప్రాంతాల్లో బూస్టర్లు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

వాటర్ బోర్డులో పాత బకాయిలు ఇప్పించండి



ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జేపీసీ మీడియా ఇన్‌చార్జ్ కొల్కం శ్రీనివాస్

అబిడ్స్: మెట్రో వాటర్ బోర్డులో కాంట్రాక్టర్ల పాత బకాయిలను ఇప్పించాలని ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేపీసీ మీడియా ఇన్‌చార్జ్ సెక్రటరీ పొల్కం శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పొల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ... వాటర్ బోర్డు ఎండీ దానకిషోర్ కాంట్రాక్టర్లను వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తాము పనులు చేస్తే ఇంత వరకు బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు శాపంగా మారిందన్నారు. చిన్న చితకా కాంట్రాక్టర్లకు అండగా ఉండి సహాయం చేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. త్వరలోనే తమ పాత బకాయిలను చెల్లించనిచో వాటర్ బోర్డు కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని పొల్కం శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునగల రాములు, రమేష్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తమా మెడిసిన్ పంపిణీ కేంద్రం ప్రారంభం



ఆస్తమా మెడిసిన్‌ను తనిఖీ చేసిన నంద కిషోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: చేప ప్రసాద పంపణీకి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నంద కిషోర్‌వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆస్తమా రోగులకు బత్తిని కుటుంబం పంపిణీ చేసే చేప ప్రసాదానికి రాష్ట్ర ప్రభుత్వం సకల ఏర్పాట్లు చేసిందన్నారు. గోషామహల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వేలాద మందికి పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం చేయూతనందిస్తున్నాయన్నారు. గురువారం ఆస్తమ రోగులకు విట్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేసిన ఆస్తమా మెడిసిన్ పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంపీ శర్మ, సాగర్ త్రివేది, నరేష్ వ్యాస్, రామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే దక్షిణాదికి అన్యాయం

జిలకర శ్రీనివాస్ విమర్శ

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సీట్లను పెంచితే దక్షిణ భారత దేశానికి తీరని అన్యాయం జరుగుతుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు జిలకర శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సౌత్ సేన ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ నియంత్రణ చర్యలు కఠినంగా అమలు చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరగలేదన్నారు. కానీ ఉత్తర భారతదేశంలో మాత్రం కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు సక్రమంగా అమలు కాకపోవడంతో అక్కడ భారీగా జనాభా పెరిగిందన్నారు. దీనివల్ల ఉత్తర భారతదేశంలో ప్రస్తుత జనాభా ప్రకారం లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం అక్కడి ఆధిపత్యం పెరుగుతుందన్నారు. దీనివల్ల ఉత్తరాదిలోని ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో అధిక లోక్‌సభ సీట్లు సాధించే పార్టీ కేంద్రంలో అధికారం చేపడుతుందన్నారు. అంటే దక్షిణాది రాష్ట్రాల అవసరమే లేకుండా పోయే ప్రమాదం నెలకొంటుందన్నారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. దక్షిణాదిలో సుప్రీంకోర్టు బెంచ్, మరో పార్లమెంటు, కేంద్ర సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దక్షిణాదిలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఉత్తరాది ఆధిపత్యం పెరిగిపోయిందన్నారు. ఈ సమావేశంలో సౌత్ సేన నాయకులు రాములు, రవి, శ్రీకాంత్, రమేష్ (పృథ్వీ), జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



కౌన్సిలింగ్‌కు హజరైన రౌడీషీటర్లు



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్ రూపేశ్

డబీర్‌పురా: రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకొని సమాజంలో గౌరవంగా జీవించాలని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్. రూపేశ్ సూచించారు. మలక్‌పేట్ ఏసీపీ డివిజన్ పరిధిలోని డబీర్‌పురా, మలక్‌పేట్, చాదర్‌ఘట్ పోలీస్‌స్టేషన్లకు చెందిన 50 మంది రౌడీషీటర్లకు గురువారం ఆయన సౌత్, ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ మనోహర్, మలక్‌పేట్ ఏసీపీ శ్యాంసుందర్‌లతో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీసులు సూచించినా... కూడా రౌడీషీటర్లు తిరిగి పదే పదే అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తామన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలిగితే వారిపై నుంచి రౌడీషీట్‌ను తొలగిస్తామన్నారు. రానున్న ఎన్నికలు, బోనాల ఉత్సవాలు, ఇతర పండుగల నేపథ్యంలో డబీర్‌పురా, మలక్‌పేట్, చాదర్‌ఘట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 50 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు.

చేప ప్రసాదానికి వచ్చే వారికి ఉచితంగా ఆహారం



ఆహారం అందజేస్తున్న నాగ్‌నాథ్ మాశెట్టి తదితరులు



బసవేశ్వరుని చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చార్మినార్: చేప ప్రసాదం కోసం ఇతర రాష్ట్రాలతో పాటు జిల్లాల నుంచి నగరానికి చేరుకున్న ప్రజలకు టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా ఆహారం అందజేశారు. ఉదయం టీ, టిఫిన్‌లతో పాటు మధ్యాహ్నం భోజనాలను అందజేశారు. పాతబస్తీ కోకర్‌వాడీకి చెందిన నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఈ ఆహర పదార్థాల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు. ముందుగా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించిన అనంతరం ఆహర పదార్థాల పంపిణీ కొనసాగింది. ఈ సందర్భంగా నాథ్‌నాగ్ మాశెట్టి మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా చేప ప్రసాదానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఉచితంగా ఆహర పదార్థాలను అందజేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈసారి కూడా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఆహర పదార్థాల పంపిణీ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు రమేశ్‌లతో పాటు వీర శైవ లింగాయత్ మహిళా నాయకురాలు పల్లె వీరమణి, దినేశ్ పట్నీ, ధర్మేందర్ పూజారి, నాగరాజు శిల్వంత్, బాబు మాశెట్టి, ప్రశాంత్ మాశెట్టి, రమేశ్ సొలంకి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా బాలిక ఆత్మహత్య



నవ్య (ఫైల్)

జియాగూడ: చదువు, ఆటల్లో టాపర్‌గా నిలిచిన ఇంటర్మీడియేట్ చదువుతున్న ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఆమె ఆత్మహత్య ఎన్నో అనుమానాలకు దారి తీస్తోంది. అమావాస్య నుంచి ఇంటి ముందు క్షుద్ర పూజలు ఎవరో నిర్వహించడం వల్లనే ఆత్మహత్యకు పాల్పడిందని... ఇది హత్యేనని ఆమె తల్లిదండ్రులు రమాదేవి, శ్రీనివాస్ దంపతులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది.

- ఇదిలా ఉండగా పోలీసులు ప్రేమ వ్యవహారం ఏమైన ఉండొచ్చనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కుటుంబ సభ్యులు అమావాస్య నుంచి తమ ఇంటి ముందు గుర్తు తెలియని వారు నిమ్మకాయలు, అగరబత్తులు, కొబ్బరి కాయాలు, పసుపు కుంకుమలు వేసి క్షుద్ర పూజలు చేసినట్లు చెప్పారన్నారు.

భరత్‌నగర్‌లో విషాదఛాయలు

- భరతనగర్‌లో రమాదేవి శ్రీనివాస్ దంపతుల రెండో కూతురు నవ్య ఎంతో చలాకీగా ఉండేదని చదువులో సైతం స్కూల్ టాపర్‌గా నిలిచిందని బస్తీవాసులు చెబుతున్నారు. బస్తీలో అందరితో కలుపుగోలుగా ఉండే నవ్య వారం రోజుల నుంచి ముభావంగా ఉన్నట్లు చెప్పారు. అంతలోనే నవ్య ఆత్మహత్య చేసుకోవడం తమను కలచివేసిందన్నారు.